ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు

- వీసీలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి
- అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 1 : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అర్బన్, ఒక రూరల్ ప్రాంతాన్ని ఎంచుకొని పైలట్ ప్రాజెక్టుగా గుర్తించి పారదర్శకంగా కార్డుల జారీ ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్లను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి మంత్రి ఫ్యామిలీ డిజిటల్ కార్డులు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, డబుల్ బెడ్రూం, ధాన్యం, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3 నుంచి 7వ తేదీ వరకు ఐదురోజులపాటు పైలట్ ప్రాజెక్టు చేపట్టే ప్రాంతంలో కుటుంబ సభ్యులు అందరూ సమ్మతిస్తే ఫొటో తీయాలని, అది ఒక ఆప్షన్‌గా మాత్రమే ఉండాలన్నారు. 119 నియోజకవర్గాల్లో ఇప్పటికే గుర్తించి 238 ప్రాంతాల్లో బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని ఆదేశించారు. డిజిటల్ కార్డుల కోసం చేపడుతున్న పైలట్ ప్రాజెక్టు ద్వారా వెల్లడయ్యే అనుభవాల ఆధారంగా సానుకూల, ప్రతికూల అంశాలపై సమగ్రమైన నివేదిక తయారు చేయాలన్నారు. అధికారులు ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

ప్రతి కుటుంబానికి అందేలా చూస్తాం

ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు అందేలా చూస్తామని మంత్రికి జిల్లా కలెక్టర్ సంతోష్ వివరించారు. డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియ, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీపై జిల్లాలోని దరఖాస్తుల స్థితిగతులను పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని విధాలా అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే కుటుంబ డిజిటల్ కార్డుల గుర్తింపు కార్డులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి ఒకప్ర త్యేకా ధికారి పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబాల సమగ్ర వివరాలను సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. కార్డుల జారీ ప్రక్రియలో కుటుంబ సభ్యుల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో డీపీవో రామ్మోహన్‌రావు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- అదనపు కలెక్టర్ దేవ సహాయం

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తాడూరు, అక్టోబర్ 1 : పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ దేవసహాయం అన్నారు. పనికిరాని ప్లాస్టిక్, సింగిల్ యజ్ ప్లాస్టిక్ చేత ఉపయోగకర వైఖ పరికరాలు తయారీ చేయడం అనేది పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని బయటికి తీసుకురావడంలో తోడ్పడుతుందన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో మంగళవారం జరిగిన ఫ్రం వేస్ట్ మెటీరియల్‌ని రీయూజ్ చేసే విధంగా పరికరాలు డెకరేషన్ పరంగా తయారు చేశారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పరిసరాల్లో, ఇండ్లల్లో పడేసే వేస్ట్ మెటీరియల్ ఉపయోగించి డెకరేషన్ వస్తువులు తయారు చేయడం ద్వారా పిల్లల్లో సృజనాత్మకత శక్తి పెరగడమే కాకుండా పరిసరాలు పరి శుభ్రంగా ఉండి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతాయన్నారు. విద్యార్థులను ఈ విధంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శోభారాణి, ఎంపీడీవో జ్యోతి, ఎంపీవో బ్రహ్మచారి, జిల్లా కోఆర్డినేటర్ ఊషన్న, విజయ, పంచాయతీ కార్యదర్శి పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రుల పుస్తకావిష్కరణ

ఉత్సవాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కల్వకుర్తి, అక్టోబర్ 1 : కల్వకుర్తి పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు కనుల పండువగా నిర్వహించనున్న దేవీ నవరాత్రోత్సవాల పుస్తకాలను మంగళవారం వాసవీ ఆలయంలో వాసవీమాత సమక్ష్యంలో ఆవిష్కరించారు. పది రోజుల పాటు వాసవీమాత శక్తి అలంకరణలతో భక్తులను దర్శనమిస్తున్న నేపథ్యంలో ఆలయంలో చేపట్టనున్న ఆధ్మాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలతో పొందుపర్చిన పుస్తకాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రమే శ్బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులు నారాయణరాజు, నితిన్‌కుమార్, కోశాధికారులు నవీన్, తరుణ్, మనీశ్, శ్రీనివాసులు, ప్రసాద్, శేఖర్, వీరేశ్, వెంకటేశ్, ప్రవీణ్, శ్రీధర్, కృష్ణయ్య, శంకర్, సురేందర్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ : కొత్ర ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబురాలు

అచ్చంపేటటౌన్ : బతుకమ్మ సంబురాల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

లింగాలలో బతుకమ్మలతో విద్యార్థులు

విద్యాలయాల్లో బతుకమ్మ వేడుకలు

- తీరొక్క పూలతో బతుకమ్మలను పెర్చిన విద్యార్థినులు
- ఆటపాటలతో అలరింపజేసిన చిన్నారులు, యువతులు

నాగర్‌కర్నూల్ : లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 1 : జిల్లా కేంద్రంలో పలు కళాశాలలు, పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పీజీ అండ్ డిగ్రీ కళాశాలలో ఉమెన్ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా సీఎన్ఆర్, లిటిల్‌ఫ్లవర్ విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను సుందరంగా అలంకరించి పాఠశాలలకు తెచ్చారు. లిటిల్‌ఫ్లవర్ వేడుకల్లో డీఈవో గోవిందరా జులు పాల్గొని బతుకమ్మ సంబురాలను ప్రారంభించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పాఠశాల ఆవరణలో బతుకమ్మలను ఒక్కచోటికి చేర్చి ఆడిపాడారు. సాయంత్రం స్థానిక కేసరి సముద్రంలో నిమజ్జనం చేశారు.

వెల్దండలో..

వెల్దండ, అక్టోబర్ 1 : మండలంలోని కొత్ర ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ సంబురాలు అంబరానాంటాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులు తీరొక్కపూలతో బతుకమ్మ ఆడారు. కోలాటాలు, ఆటా, పాటలతో ఊరేగింపు నిర్వహించారు. దాండియాతో అలరించారు. అనంతరం స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు శోభన్‌బాబు, ఫర్జానబేగం, సమత, అహ్మద్, విద్యార్థులు ఉన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేటటౌన్/అచ్చంపేటరూరల్, అక్టోబర్ 1 : అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం అచ్చంపేట పట్టణంలోని గౌతమి హైస్కూల్‌లో చిన్నారులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారు చేసి బతుకమ్మ పాటలతో సందడి చేశారు. అచ్చంపేట పట్టణంలోని ఎస్‌వీఆర్ గ్రామర్ స్కూల్‌లో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమా ర్ పాఠశాల బృందం జ్యోతి, కేదారి, మమత, అలివేల, భవాని, రేవతి, దీప్తి, శరత్ చంద్ర, కురుమయ్య, వినోద్, ప్రశాంత్, వరలక్ష్మి, ప్రిన్సిపాల్ శేఖర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల, అక్టోబర్ 1 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మను తయారు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మను మధ్యలో ఉంచి ఆటపాటలతో నృత్యాలు చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు. అదేవిధంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బషీర్‌అహ్మద్, ఉపాధ్యాయులు కొండయ్య, శంకరయ్య, పురుషోత్తం, విజయ్‌కుమార్, నర్సింహ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంగమ్మ పాల్గొన్నారు.

అమ్రాబాద్‌లో..

అమ్రాబాద్, అక్టోబర్ 1 : అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. దసరా పండుగ నేపథ్యంలో ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో ముందస్తుగా పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు అందరూ ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి పసుపు ముద్దతో గౌరమ్మను తయారుచేసి ఆటపాటలతో బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నా రు. బతుకమ్మ పండుగ ప్రాముఖ్యత గురించి అమ్రాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్ విద్యార్థులకు వివరించారు. అనంతరం బతుకమ్మలను గంగమ్మ ఒడికి చేర్చారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ రాధ, కళాశాలల అధ్యాపకులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేట/బల్మూరు మండలాల్లో..

బల్మూరు/తిమ్మాజిపేట, అక్టోబర్ 1 : బల్మూరు మండలంలోని ఆయా ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకొన్నారు. అలాగే తిమ్మాజిపేట మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో విద్యార్థులు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 1 : మండలంలోని పెద్దకార్పాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి బొడ్డమ్మలు వేశారు. కార్యక్రమంలో హెచ్ఎండీ నజీరొద్దీన్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, పర శ్రాములు, ఆంజనేయులు, అనిల్‌కుమార్, శివలింగం, దేవలక్ష్మి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్రాబాద్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబురాలు

నాగర్‌కర్నూల్ డిగ్రీ కళాశాలలో..

పెద్దకొత్తపల్లి : బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

బల్మూరు : కొండనాగుల డిగ్రీ కళాశాలలో బతుకమ్మతో విద్యార్థులు

దసరా పండుగ వచ్చిన ఆనందమే లేదు

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో మొర పెట్టుకున్న స్థానికులు

రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తిమ్మాజిపేట, అక్టోబర్ 1 : దసరా పండుగ వస్తుందన్న ఆనందం లేదని, కేసీఆర్ పాలనలో తమకు ప్రభుత్వం నుంచి పలు పథకాలు వచ్చేవని, నేడు ఎలాంటివి అందకుండా పోయాయని స్థానికులు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం తిమ్మాజిపేటలో టీ కోసం ఆగిన ఆయన వద్దకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు వచ్చి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో తమకు ప్రభుత్వ సాకారం లేకుండా పోయిందన్నారు. గతంలో రైతుబంధు దసరా సమయానికి అందేదని, పెట్టుబడి సాయం వచ్చేదన్నారు. రైతుబంధు అనేదే లేకుండా పోయిందని పేర్కొన్నారు. రుణమాఫీ అరకొరగానే జరిగిందని, పింఛన్లు సకాలంలో రావడం లేదన్నారు. తాము నమ్మి మోసపోయామంటూ గోడు వెల్ల బోసుకున్నారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే వారికి భరోసా ఇస్తూ మార్పు అంటూ ప్రజలు మోసపోయారని, కొంతకాలం ఆగాలని, మళ్లీ మంచి కాలం వస్తుందన్నారు. ఈ సందర్భంగా చాలా మంది తమకు ఇండ్లు కూలి పోయాయని, పింఛన్ రావడం లేదని, మహాలక్ష్మి కార్యక్రమంలో ఉచిత గ్యాస్, ఉచిత కరెంట్ రావడం లేదని మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అందరితో ఓపికగా మాట్లాడి నచ్చచెప్పారు. తిమ్మాజిపేట మండలంలో మాజీ ఎమ్మెల్యే పలువురిని పరామర్శించారు. గొరిట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మురళీధర్‌రెడ్డి కాలుకు దెబ్బలు తగలడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అప్పాజిపల్లిలో బీఆర్ఎస్ నేత సురేందర్‌రెడ్డి తండ్రి ఇటీవల మర ణించడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అదేవిధంగా గుమ్మకొండలో మృతి చెందిన గాలయ్య కుటుంబాన్ని పరామర్శించారు. తిమ్మాజిపేటలో ఇటీవల చెరువులో పడి మృతి చెందిన శేఖర్ ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అదే గ్రామంలో పోచమ్మ కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు హన్మంతరావు, బీఆర్ఎస్ నాయకులు హుస్సేని, వెంకటస్వామి, నర్సిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మల్లయ్య పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో..

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మండలంలోని పలువురు బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుమ్మెర గ్రామంలో ఇటీవల మృతి చెందిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ పల్లె బాలరాజు కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం బిజినేపల్లి మండలం మంగనూర్‌లో పట్టపగలు మల్లికార్జున్ ఇంట్లో దొంగలు పడి బంగారు, నగదు దోచుకెళ్లడంతో బాధితుడికి పరామర్శించారు. ప్రత్యేక టీమ్‌ను నియమించి విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని పోలీసులను కోరారు. పాలెం అగ్రికల్చర్ యూనివర్సిటీ ఎదుట సీతాఫలాలు అమ్ముతున్న ఓ అవ్వ వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ ఆమెతో సీతాఫలాలు కొనుగోలు చేశారు.

బావిలో పడి మహిళ మృతి

వెల్దండ, అక్టోబర్ 1 : మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన కేశమోని లక్ష్మమ్మ(60) బావిలో పడి మృతి చెందింది. వివరాలో కెళ్తే.. కేశమోని లక్ష్మమ్మ ఆవులు, ఎద్దులు కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఈ క్రమంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు ఆమె పశువులను అపహరించుక పోవడంతో మానసిక ఒత్తిడికి గురై ఇబ్బందులు పడుతుంది. శనివారం పొలం వద్దకు వెళ్లిన లక్ష్మమ్మ తిరిగి రాకపోవడంతో కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులతోపాటు కుటుంబ సభ్యులు గాలించారు. సోమవారం ఉదయం గ్రామ శివాలో ఉన్న బావిలో లక్ష్మమ్మ మృతదేహం తేలడంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. లక్ష్మమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులను కల్వకుర్తి ప్రభుత్వ దవాఖాన ప్రాంతంలో పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

చెరువులో పడి మత్స్యకారుడు..

పెంట్లవెల్లి, అక్టోబర్ 1 : మండల కేంద్రం సమీపంలోని చౌటచెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్సై రామన్‌గౌడ్ కథనం మేరకు మండల కేంద్రానికి చెందిన జంగిటి ఆంజనేయులు(37) సోమవారం మధ్యాహ్నం చౌట చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం చౌటచెరువు కట్ట రహదారిపై వెళ్లే బాటసారులు చెరువు తూము వద్ద మృతదేహాన్ని గమినించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదే హాన్ని బయటికి తీశారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు కూతురులు, ఓ కుమారుడు ఉన్నారు.

హెల్త్ అసిస్టెంట్ ఆత్మహత్య

ఆశన్న (ఫైల్)

తిమ్మాజిపేట, అక్టోబర్ 1 : మండలంలోని ఎదిరేపల్లి గ్రామంలో ఓ హెల్త్ అసిస్టెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. తిమ్మాజిపేట పీహెచ్ సీలో భాగంగా నేరాళ్లపల్లిలోని సబ్ సెంటర్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆశన్న(48) మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య, పిల్లలు బయట పని చేస్తుండగా ఆకస్మాతుగా తలుపు గొల్లెం పెట్టుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన భార్య స్థానికుల సాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా కొన ప్రాణంతో ఉన్న అతడిని జడ్చర్ల ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. ఆశన్న కొద్దికాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. అనారోగ్య సమస్యలు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

- పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఆదిశంకర్

సమావేశంలో మాట్లాడుతున్న ఆదిశంకర్

కోడేరు, అక్టోబర్ 1 : మామిడి పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించి అధిక లాభాలు పొందవచ్చని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఆదిశంకర్ సూచించారు. మండలంలోని నర్సాయపల్లి రైతువేదిక భవనంలో జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మామిడి రైతుల శిక్షణ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతి థిగా హాజరై మాట్లాడారు. భారత ప్రభుత్వం క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాంలో భాగంగా ఉమ్మడి మహ బూబ్‌నగర్ జిల్లాను ఎంపిక చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 57వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందకుగానూ కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి మహ బూబ్‌నగర్ జిల్లాను మెగా క్లస్టర్‌గా కేటాయించిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాల నుంచి కల్పించే రాయితీలను కూడా రైతులకు అంద జేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా 53 ఉద్యానవన క్లస్టర్లను గుర్తించగా పైలట్ బేసిస్‌లో ఉమ్మడి మహ బూ బ్‌నగర్ జిల్లాను ఎంపిక చేసుకొని ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఆయన వివరించారు. మామిడి తోట సాగులో పాటించావల్సిన మెళుకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మణ్, ఏఈవోల పృద్వీరాజ్, నవ్య భారతి, సువర్ణ, సురేశ్, ఏరియా మేనేజర్ శివ, చంద్రశేఖర్, అజయ్, మామిడి రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ఈజీఎస్

సన్నాహక సమావేశం

అమ్రాబాద్, అక్టోబర్ 1 : 2025-26వ సంవత్సరానికి ఉపాధి పనుల నిధుల కోసం మండల కేంద్రంలో ని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటయ్య ఆధ్వర్యంలో మంగళవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వచ్చే 2025-26వ సంవత్సరానికి ఉపాధి హామీ పనుల కూలీలకు వారి శ్రమకు తగ్గ ఫలితాలు అందించడానికి నిధుల జమ ఖర్చులను ఎలా ఉపయోగిం చుకోవాలనే అంశంపై ఉపాధి సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఎఫ్ఏ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించాలి

ఊర్కొండ, అక్టోబర్ 1 : గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం మహాత్మగాంధీ జయంతిని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్ నాయక్, ఏపీవో నర్సింహులు, కిషన్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సారంబండతండాలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చారకొండ, అక్టోబర్ 1 : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో ఇసా కొస్సేన్ అన్నారు. మండలంలోని సారంబండతండా, తుర్కలపల్లి గ్రామాల్లో మంగళవారం ఎంపీడీవో ఇసా కొస్సేన్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు, ఏర్పాట్లపై బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పంచాయతీ రికార్డులతోపాటు ఉపాధి హామీకి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పారిశుధ్య కార్యక్రమాలు నిత్యం నిర్వహించాలని, బుధవారం అన్ని జీపీల్లో గాంధీ జయంతితోపాటు గ్రామ సభలు నిర్వహించాలని చెప్పారు. ఆయన వెంట ఎంపీవో వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి వినోద్ ఉన్నారు.

నవోదయ 9, 11వ తరగతులకు దరఖాస్తులు

బిజినేపల్లి, అక్టోబర్ 1: మండలంలోని వట్టెంలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతికోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ రెండు పరీక్షలకోసం 08-02-2025న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దర ఖాస్తు చేసుకోవాలని కోరారు.